క్లుప్తంగా

ముగిసిన వర్క్‌షాపు



శిక్షణలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కళాశాల యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఎంసీఏ కళాశాలలో మూడు రోజుల వర్క్‌షాపు బుధవారం ముగిసింది. వర్క్‌షాపులో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి, వారిలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం కోయంబత్తూరులోని టాలెంట్ షాఫ్ట్ సంస్థకు చెందిన పలువురు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్ర బాబు తెలిపారు. ఈ శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, మెంటల్ ఎబిలిటీని పెంచడం కోసం శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లో ఓల్టేజి సమస్య తలెత్తకుండా చర్యలు



కెపాసిటర్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఈఈ శ్రీనివాసమూర్తి

పెద్దపంజాణి: మండలంలోని పెనుగొలకల సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు లో ఓల్టేజి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు పుంగనూరు డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. పెనుగొలకల సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెపాసిటర్ బ్యాంకును ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎండా కాలంలో లో-ఓల్టేజీతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బ తినకుండా ఉండాలనే ఉద్దేశంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసులు, పెద్దపంజాణి ఏఈ వెంకట్రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయతకు ఇఫ్తార్ ప్రతీక



ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మున్సిపాలిటీలోని గడ్డూరు మసీదులో బుధవారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ముస్లింలతో కలిసి నమాజ్ అనంతరం ఆయన మాట్లాడారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలందరికీ అల్లా కరుణ ఉంటుందన్నారు. ఇఫ్తార్ కార్యక్రమం ఆత్మీయతలకు ప్రతీక అని చెప్పారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, రహీం ఖాన్, కమాల్, శ్యామ్, నయాజ్, ఇస్మాయిల్, ముజ్జు, బాబా తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం



వేలం నిర్వహిస్తున్న కార్యదర్శి సదాశివయ్య

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ సంబంధించి బుధవారం మార్కెట్ల వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య తెలిపారు. గొర్రెల సంత, ప్రైవేటు బస్టాండ్, కోళ్ల సంత హక్కులకు వేలం నిర్వహించినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న టైలర్స్ నేతలు

వి.కోట: మండలంలోని సందగట్టుకు చెందిన టైలర్ చంగరాజు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని అంత్యక్రియలకు మండల టైలర్స్ యూనియన్ రూ.5 వేలను అందజేసింది. యూనియన్ సభ్యులు మాట్లాడుతూ, మండలంలో ఎవరైనా టైలర్లు మృతి చెందితే యూనియన్ తరఫున సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ టైలర్ రామకృష్ణ, శంకర్, ముక్తియార్, మురుగేష్, బట్టి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో బుధవారం శక్తి యాప్‌పై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మహేశ్వర్, ఎస్‌ఐ నాగసౌజన్య విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల భద్రతను పెంపొందించడానికి ఈ యాప్ ద్వారా అత్యవసర సేవలు పొందవచ్చన్నారు. సమస్యలు ఎదురైతే నిర్భయంగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని వారు పేర్కొన్నారు.

మినరల్ కాదు.. బోరు వాటరే..!

పలమనేరు ప్రాంతంలో మంచి నీటి వ్యాపారం జోరందుకుంది. పలువురు నీటి వ్యాపారులు నిబంధనలకు విరుద్ధం వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఏ ప్లాంట్‌కు ఐఎస్‌ఐ ఉందో దేనికి లేదో కూడా తెలియని పరిస్థితి. సాధారణ నీటినే ట్యాంకర్లతో తెచ్చి మినరల్ వాటర్ అని చెప్పి బురిడీ కొట్టిస్తున్నారు. జనం మినరల్ వాటరేనని నమ్మి కొనుగోలు చేస్తున్నారు. వీటి వినియోగంతో చిన్నపాటి సమస్యల బారిన పడుతున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధక శాఖలు నిద్రావస్థలో జోగుతున్నాయి.

- నాణ్యతా ప్రమాణాలకు పాతర
- ఐఎస్‌ఐ ముద్ర లేకుండా సాగుతున్న వ్యాపారాలు
- ప్రజల ఆరోగ్యంతో వాటర్ ప్లాంట్ల చెలగాటం
- పట్టించుకోని ఆహార కల్తీ నిరోధక శాఖ



సాధారణ బోర్ల నీటిని నింపి మినరల్ వాటర్ పేరిట విక్రయిస్తున్న నీళ్ల క్యాన్లు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో 11 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి నుంచి నీటిని క్యాన్లు, ప్యాకెట్లలో విక్రస్తున్నారు. దీంతో పాటు అసలు వాటర్‌ప్లాంట్లు లేకనే బోర్లలో నీటిని నింపి మినరల్ వాటర్ పేరిట విక్రయించే ట్యాంకర్లు 400 వరకూ ఉన్నాయి! అయితే ఈ నీళ్ల తయారీలో నాణ్యతా ప్రమాణాలు అస్సలు పాటించకుండా జేబులు నింపుకోవడమే పరమావధిగా వ్యాపారం సాగిస్తున్నాయి. ఫలితంగా మూడు వాటర్ ప్యాకెట్లు–ఆరు క్యాన్లు అనే చందాన నిర్వాహకులకు ఈ వ్యాపారం కాసులు కురిపిస్తోంది.

నీటి అమ్మకాలపై ఇవీ నిబంధనలు

ఎవరైనా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు దరఖాస్తు చేసుకోవాలి లేదా ఐఎస్‌ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూషన్) ద్వారా అనుమతులు పొందాలి. ముంబై, చెన్నైలకు చెందిన ఈ సంస్థ ఓ బృందాన్ని పంపి దీనిపై తనిఖీలు నిర్వహిస్తుంది. బోరు పాయింట్ నుంచి వచ్చే నీటిని ల్యాబ్‌కు పంపి అన్ని రకాల పరీక్షలు చేస్తుంది. ఆపై అనవసర లవణాలను తీసివేసి ఆరోగ్యదాయకంగా నీటిని తయారు చేయాల్సి ఉంటుంది. అన్ని సంతృప్తికరంగా ఉంటేనే ఐఎస్‌ఐ సర్టిఫికెట్లను జారీ చేస్తుంది. ఈ ప్లాంటుకు సంబంధించిన అనుమతి, స్ట్రక్చర్ తదితరాలను మాత్రం సంబంధిత పంచాయతీలు, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియను చాలావరకు వాటర్‌ప్లాంట్ యజమానులు అసలు చేయడం లేదు. కొందరు చెన్నైలోని బయో హెర్బల్ సంస్థ నుంచి తూతూమంత్రంగా సర్టిఫికెట్లను తెచ్చుకుని ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. మిగిలిన వారికి అసలు నిబంధనలూ తెలియవు. అంతేకాకుండా అనుమతులు అస్సల్లేవు!

సాధారణ బోర్ల నీటినే..!

వ్యవసాయ బోర్ల నుంచి వచ్చే నీటినే క్యాన్లకు నింపి ఒక్కో క్యాను(20లీటర్లు) రూ.30గా విక్రయిస్తున్నారు. ఈ వాటర్ క్యాన్లకు కనీసం లేబుళ్లు కూడా ఉండవు. ఒకవేళ లేబుల్ ఉన్నా వాటిపై మాన్యుఫ్యాక్చరింగ్, ఎక్స్‌పైరీ, ఐఎస్‌ఐ ఇలాంటివేమీ ఉండవు. ఇక వాటర్ ప్యాకెట్లయితే దుర్వాసన చిమ్ముతుంటాయి. వాటర్ ప్యాకెట్లను బస్తాల్లో నింపి విక్రయిస్తున్నారు. మరికొందరు బయటి ప్రాంతాల్లో తమకు ఏజెన్సీలు ఉన్నాయంటూ మామూలు నీటినే ఏదో ఓ పేరు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. పలమనేరుకు సంబంధించి రోజూ నీళ్ల వ్యాపారం రూ.3 లక్షల పైచిలుకు సాగుతున్నట్టు అనధికార అంచనా. ఈ ఆ లెక్కన నియోజకవర్గం మొత్తం మీద రూ. 6 లక్షల వరకూ నీటి వ్యాపారం సాగుతోంది. అయితే అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట ప్రాణ సంకటంగా మారింది.

23న తిరుపతిలో 'మాలల సింహగర్జన'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

చౌడేపల్లె: ఈ నెల 23న తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన రాయలసీమ మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని సింహగర్జన జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ యమలా సుదర్శనం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో మాల మహానాడు నాయకులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఈ కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, ధనశేఖర్, చంద్రయ్య, మనోహర్, మల్లెల మోహన్, మణి, రాము, రెడ్డి, సురేష్, వెంకటరమణ, ముకుంద, అశోక్, వేణు, అంజి పాల్గొన్నారు.

జాతర చాటింపు



పుంగనూరు శ్రీ సుగుటూరు గంగమ్మ

పుంగనూరు: పుంగనూరులో జమీందారుల కుల దైవమైన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతర నిర్వహణకు మంగళవారం రాత్రి తోటి కులస్తులు ప్యాలెస్ ఆవరణలో చాటింపు వేసి, పట్టణంలో దండోరా వేశారు. ఈనెల 25, 26 తేదీలలో జాతరను అట్టహాసంగా నిర్వహించేందుకు జమీందారి కుటుంబీకులు రాజసోమశేఖర్ చిక్కరాయల్, రాజా మల్లికార్జున చిక్కరాయల్, వారి కుటుంబీకులు గ్రామ పెద్దలు, అధికారులు, పాలక మండలి సభ్యులతో కలసి ఏర్పాట్లకు సమాయత్తం అయ్యారు. కులమతాలకతీతంగా జాతరను నిర్వహించడం పరిపాటి. సుమారు ఎనిమిది శతాబ్దాల చరిత్ర ఈ జాతరకు ఉంది. ప్రతి యేటా జాతరలో అమ్మవారికి సారెను పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సతీమణి స్వర్ణమ్మతో కలిసి సమర్పించడం ఆనవాయితీ. అలాగే జాతరకు కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు రానున్నారు.



జాతర చాటింపు వేస్తున్న తోటి కులస్తులు

ఆ నలుగురూ.. హెల్పింగ్ హ్యాండ్స్..!



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ బృందం

పలమనేరు: కన్నబిడ్డల నిరాదరణకు గురై అనాథలై ఊరుగానిచోట మృతిచెందితే.. ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకువచ్చు. ఇలాంటి సంఘటనే పలమనేరులో బుధవారం చోటుచేసుకుంది. నియోజకవర్గంలోని గంగవరం మండలం పత్తికొండ ప్రాంతం నుంచి ఓ వృద్ధుడు(69) ఈనెల 6న స్థానిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స పొందుతూ 10వ తేదీ మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని స్థానిక పోలీసులు మంగళవారం వరకూ ఉంచి మృతుడి బంధువులెవరైనా వస్తారేమోనని ఎదురుచూశారు. కానీ ఎవరూ రాకపోవడంతో అంత్యక్రియల నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు ఆ వృద్ధుడి మృతదేహాన్ని అప్పగించారు. దీంతో సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలను నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, శక్తి, జీలాని, కుమార్, పృథ్వీరాజ్, పోలీసులు పాల్గొన్నారు.

వేలంలో పంచాయతీకి పెరిగిన ఆదాయం



మార్కెట్ల వేలం నిర్వహిస్తున్న అధికారులు

వి.కోట: మార్కెట్ల వేలంలో వీ.కోట పంచాయతీకి రూ.30,16,100 ఆదాయం సమకూరినట్లు ఈఓ శివశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రధాన గ్రామ సచివాలయ కార్యాలయంలో డివిజినల్ పంచాయతీ అధికారి లక్ష్మి అధ్యక్షతన మార్కెట్ల వేలం నిర్వహించారు. వారపు సంతకు రూ. 2,90,000, దినసరి మార్కెట్ రూ.5,10,000. ప్రైవేట్ బస్టాండ్ రూ.10,71,000. పశువుల సంత రూ.4,40,000 జంతువధశాల రూ.19,100 ,గొర్రెలు, మేకల సంత రూ. 4,73,000. కమ్యూనిటీ మరుగుదొడ్లు రూ.2,13,000లకు పాటదారులు హక్కులను కైవసం చేసుకున్నారని సర్పంచ్ పీఎస్ లక్ష్మి తెలిపారు. మొత్తంగా గత ఏడాది కంటే కంటే రూ 1,46,600 అధికంగా ఆదాయం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.19.27 లక్షల ఆదాయం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని వారపుసంత, దినసరి మార్కెట్, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి బుధవారం నిర్వహించిన వేలం పాటల్లో రూ.19.27లక్షల ఆదాయం సమకూరిందని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వారపు సంతకు రూ.9.40 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.9.32 లక్షలు, మరుగుదొడ్లకు రూ.55,500 ఆదాయం లభించినట్లు ఆయన చెప్పారు. పాటదారులెవరూ రాని కారణంగా ప్రైవేటు బస్టాండ్ వేలం వాయిదా వేసినట్లు తెలిపారు.

వేలంలో రూ.11.36 లక్షల ఆదాయం

చౌడేపల్లె: వేలం పాటల్లో చౌడేపల్లె మేజరు పంచాయతీకి రూ.11.36 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓపీఆర్డీ కృష్ణవేణి తెలిపారు. బుధవారం పంచాయతీ సచివాలయ ఆవరణలో వేలం పాటలను నిర్వహించారు. కూరగాయాల సంతలో గేటు వసూలు హక్కును కె.గిరిబాబు రూ.9.53 లక్షలు, ప్రైవేటు బస్టాండులో గేటు వసూలు రూ.1.81 లక్షలు, కొబ్బరి చెట్ల ఫలసాయం పొందే హక్కు రూ.2700 భాస్కర్ హెచ్చుపాటతో కైవసం చేసుకున్నారు. సర్పంచ్ వరుణ్ భరత్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ పాల్గొన్నారు.

యానాది మహిళలకు చీరలు పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న తాతయ్య

చౌడేపల్లె: మండలంలో గడ్డంవారిపల్లె రోడ్డులోని ఎస్టీ కాలనీ యానాది మహిళలకు బుధవారం సినీ నటుడు మోహన్‌బాబు అభిమాన సంఘ మండలాధ్యక్షుడు తాతయ్య చీరలను పంపిణీ చేశారు. మోహన్‌బాబు జన్మదినం సందర్భంగా 42 మంది మహిళకు చీరలు పంపిణీ చేయడంతోపాటు కేక్, స్వీట్లు అందజేసినట్టు చెప్పారు. అనంతరం రంగంపేటలోని విద్యానికేతన్ ఆవరణలో మోహన్‌బాబును కలిశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పుస్తకాలు విరాళం



పుస్తకాలను విరాళంగా ఇస్తున్న నారాయణ దంపతులు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విశ్రాంత ఉద్యోగులు జీఆర్. నారాయణ, రాధిక దంపతులు రూ.50 వేల విలువ చేసే పుస్తకాలను బుధవారం ప్రిన్సి పాల్ డాక్టర్ రాజశేఖర్‌కు అందజేశారు. డిగ్రీ విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ సైన్సు, కంప్యూటర్ అప్లికేషన్స్‌కు సంబంధించిన 170 పుస్తకాలను కొనుగోలు చేసి ఇచ్చినట్టు ఆయన నారాయణ దంపతులు తెలిపారు. పుస్తకాలను లైబ్రరీలో ఉంచి విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. దాతలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

హిందీ పరీక్షకు 10 మంది గైర్హాజరు

గంగవరం: మండలంలో బుధవారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షలకు పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 729మంది పరీక్షలు రాయవలసి ఉండగా 719మంది మాత్రమే హాజరయ్యారని చెప్పారు.

విద్యుత్ సమస్యలపై మూడు వినతులు



సమస్యలను తెలుసుకుంటున్న డీఈ ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వినియోగదారులు సమస్యలను తెలియజేశారు. మొత్తం 3 ఫిర్యాదులు వచ్చాయని డీఈ ప్రసాద్ తెలిపారు. అందులో సంతపేట సెక్షన్ పరిధిలో మీటర్‌కు అనుసంధానం చేసిన ఫోన్ నెంబర్‌ను మార్పు చేయాలని వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. కొత్త సర్వీసు విడుదలపై చిత్తూరు రూరలఖ సెక్షన్ నుంచి సమస్యను తెలిపారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై మరో వినియోగదారుడు తెలుసుకొని పైకం చెల్లించారు. టెక్నికల్ ఏఈ మాధురి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆరీఫా షేక్

పుంగనూరు: మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీనియర్ సివిల్‌జడ్జి ఆరీషా షేక్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే భర్తలు, వారి కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధిస్తే భర్తతో పాటు వేధించిన వారిపై కేసులు నమోదు చేస్తారన్నారు. మహిళలకు ఆర్థిక స్థోమత లేకపోతే న్యాయస్థానం న్యాయవాదిని నియమించి, కేసులను వాదించనున్నట్టు తెలిపారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో ఏపీఎం కృష్ణప్ప, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయ అర్చకునికి సన్మానం



రాజశేఖర దీక్షితులను సత్కరిస్తున్న వాసవి, వనిత క్లబ్ ప్రతినిధులు

చౌడేపల్లె: ధర్మశాస్త్ర డాక్టరేట్ అందుకున్న శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర దీక్షితులను వాసవి వనిత క్లబ్ ప్రతినిధుల బృందం బుధవారం సత్కరించింది. విశ్వజ్యోతి విద్యాపీటం ఓరియంటల్ హెరిటేజ్ (కోల్‌కత్త) 46వ వార్షికోత్సవం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించారు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్లు విష్ణుదేవర వర్మ, రవిచంద్రన్ చేతుల మీదుగా రాజశేఖర దీక్షితులకు రత్న విద్యానిధి అవార్డు అందుకోవడం విదితమే. ఈ నేపథ్యంలో వాసవి, వనిత క్లబ్ ప్రతినిధులు ఇస్సా నాగలక్ష్మి, రాము, కృష్ణమూర్తి, అమరనాథ్, లోకేష్ తదితరుల ఆయన్ను సత్కరించారు.

నోటీస్ బోర్డు

నేటి నుంచి శిక్షణా తరగతులు

చౌడేపల్లె: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో పోషణ్ భీ పదాయ్ భీ కార్యక్రమం అమలుపై అంగన్‌వాడీ సిబ్బందికి గురువారం నుంచి మూడురోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. మండలంలోని 66 కేంద్రాల నుంచి సిబ్బంది శిక్షణకు హాజరు కావాలని కోరారు.

బోయకొండలో వేలం పాటలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఇటీవల నిర్వహించిన వేలంలో వాయిదా పడిన తలనీలాల సేకరణ, కొండపై క్లాక్ రూము నిర్వహణ, పాదరక్షలు భద్రపరచుకోవడం, పేపరు కవర్లు, బ్యాగుల విక్రయం హక్కులపై వేలం నిర్వహిస్తామని, నిర్ణయించిన ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈఓ కోరారు.

21, 22న మెగా సదరం క్యాంపు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో దివ్యాంగుల ధృవీకరణ పత్రాల కోసం ఈ నెల 21, 22న సదరం మెగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం వంద పడకల ఆస్పత్రిలో 21న శుక్రవారం రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాలకు, 22న కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రూరల్ మండలాల వారికి సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ధృవీకరణ పత్రాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఇదివరకు ఏదైనా డాక్టర్ వద్ద పొందిన రిపోర్టుతో ఈ శిబిరానికి హాజరు కావాలని కోరారు. మరింత సమాచారం నిమిత్తం స్థానికంగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

కస్తూర్బా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పట్టణంలో నక్కబండలోని కస్తూర్బా పాఠశాలలో అడ్మిషన్ల నిమిత్తం బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎందో చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సాయంత్రం తెలిపారు. 6, 11 తరగతుల్లో , 7,8 , 9, 10, 12 తరగతులలో మిగిలిన సీట్ల కోసం ఈనెల 22 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్: 7075159996, 7075039990 లకు కాల్ చేసి తెలుసుకోవాలని కోరారు.

పుంగనూరులో పోలీస్ గ్రీవెన్స్

పుంగనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రతి మంగళవారం పోలీస్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. ప్రజల నుంచి పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ ఫిర్యాదులను స్వీకరిస్తారని, ఉదయం 10 మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో శ్రీ కాళహస్తీశ్వరస్వామి

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లెలో బుధవారం శ్రీ కాళహస్తీశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ